అర్హులందరికీ లబ్ధి చేకూర్చడమే ధ్యేయం



వెంకటభైరిపురంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

● కలెక్టర్ నిషాంత్‌కుమార్

మక్కువ: అర్హులందరినీ గుర్తించి, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమఫలాల లబ్ధిని చేకూర్చడమే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ధ్యేయమని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అన్నారు. మండలంలోని వెంకటభైరిపురం, డి.శిర్లాం గ్రామాలలో ఎంపీడీవో సీహెచ్.సూర్యనారాయణ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ నిషాంత్‌కుమార్, ఐటీడీఏ పీవో విష్ణుచరణ్, జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిషాంత్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు గతనెల 24వతేదీన వలంటీర్లు ఇంటింటికి వెళ్లి, క్యాంపుల సమాచారాన్ని అందించి, వ్యక్తిగత వివరాలు సేకరించారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక క్యాంపులకు సంబంధించి 11రకాల ప్రధాన ధ్రువీకరణ పత్రాల జారీకి ఎలాంటి సర్వీసు చార్జీలను వసూలు చేయకుండా అందించనున్నట్లు చెప్పారు. జగనన్న సురక్ష కార్యక్రమం ఈనెల 31వ తేదీవరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సచివాలయాల వద్ద అధికారులు ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని సూచించారు. లబ్ధిదారుల నుంచి అందే వినతులు సత్వరమే పరిష్కరించాలని పేర్కొన్నారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మరడ వెంకటరత్నం, గేదెల రాధిక, ఎంపీటీసీ అప్పలనాయుడు, తహసీల్దార్ సూర్యనారాయణ, ఈవోపీఆర్‌డీ దేవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో సేవలు

పార్వతీపురం: ప్రజలకు అందుబాటులో సేవలందించేందుకు జగనన్న సురక్ష పథకాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందని కలెక్టర్ నిషాంత్ కుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలో జగనన్న సురక్ష పథకాన్ని ఆయన పట్టణంలోని వివేకానంద కాలనీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా జగనన్న సురక్ష పథకం అమలు, ఏర్పాట్లు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ శిబిరాలకు వచ్చే ప్రజలకు టోకెన్లు జారీ, ఇతర సౌకర్యాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సేవలను అందించాలని సూచించారు. జగనన్న సురక్ష పథకం ద్వారా మంజూరు చేసిన ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష..సేవల భాండాగారం

బలిజిపేట: జగనన్న సురక్ష పథకం గ్రామాలలో ప్రజల సేవా భాండాగారమని ఎమ్మెల్యే జోగారావు తెలిపారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని గంగాడ, గలావల్లి సచివాలయాల పరిధిలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి వారికి కావల్సిన ముఖ్యమైన సేవలకు తక్షణమే పరిష్కారం లభించే విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ఈ పథకంలో కులం, ఆదాయ, జనన, మరణ సర్టిఫికెట్లు, మ్యుటేషన్ పత్రాలు, కొత్త రేషన్ కార్డులు, రేషన్‌కార్డుల విభజన, ఆధార్‌లో మార్పులు, చేర్పులు, ఆధార్‌కు ఫోన్ నంబర్ అనుసంధానం, వివాహ ధ్రువీకరణ తదితర పత్రాలను అందిస్తారని తెలిపారు. దీనికి సంబంధించి వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి వారి అవసరాలకు అనుగుణంగా పత్రాలను తయారుచేయాల్సి ఉందన్నారు. గంగాడలో 163, గలావల్లిలో 1084టోకెన్లు రాగా వాటిని పరిష్కరించి లబ్ధిదారులకు పత్రాలు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ ఎం.శ్రీకాంత్, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, ఎంపీడీఓ విజయలక్ష్మి, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, సర్పంచ్‌లు కె.మోహనరావు, బి.నారాయణరావు, సూర్యనారాయణ, జి.సత్యనారాయణ, టి.ప్రసాద్, జి.జగన్, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో బహుళ ప్రయోజనాలు

సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజలు బహుళ ప్రయోజనాలు పొంద గలుగుతున్నారని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు శనివారం సీతానగరం మండలం అంటిపేటలో జగనన్న సురక్ష పథకం అమలుకు ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అధ్యక్షతన గ్రామ సభ జరిగింది. గ్రామసభకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే అలజంగి జోగారావు 241 పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎంబాబ్జీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు బి.శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి. చిట్టిరాజు, సర్పంచ్ బి.తిరుపతిరావు, మాజీ సర్పంచ్ ఎస్. మహేశ్వరరావు, డీసీసీబీ డైరెక్టర్ కృష్ణంనాయుడు, ఎంపీటీసీ ఎస్.నిర్మల, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.తిరుపతి, వైఎస్సార్‌సీపీ నాయకులు పి. ఈశ్వరనారాయణ, పార్థసారథి, ఆర్ఐ ఎస్.శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

ప్రజలకు నేరుగా ప్రభుత్వ సేవలు

ప్రభుత్వ సేవలు ప్రజలకు నేరుగా అందడమే జగనన్న సురక్ష పథకం ఉద్దేశమని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. పార్వతీపురం పట్టణంలోని ఎస్ఎన్‌పురం, మండలంలోని పెదబొండపల్లి సచివాలయాల పరిధిలో శనివారం జరిగిన జగనన్న సురక్ష క్యాంపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా వారం రోజులుగా గ్రామంలో గల ప్రతి ఇంటికి వలంటీర్లు, గృహ సారథులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు వెళ్లి వారికి ఏవైనా సమస్యలు ఉన్నాయేమో అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందజేస్తున్న 11 సేవలలో భాగంగా ఆర్జీ పెట్టుకున్న సుమారు 347 మంది లబ్ధిదారులకు శనివారం ఎమ్మెల్యే చేతుల మీదుగా అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో సంబంధిత ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకురాలు శోభా హైమవతి, పురపాలక సంఘం, మండల ప్రజా ప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, మండల అధికారులు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, లబ్ధిదారులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



బలిజిపేట: గంగాడలో లబ్ధిదారుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

విత్తన మొలకశాతం గుర్తించాలి



పొలంబడిలో సూచనలు ఇస్తున్న ఏఓ శ్రావణ్

బలిజిపేట: విత్తన మొలకశాతాన్ని గుర్తించి మంచి విత్తనాలను వేసుకోవాలని ఏఓ శ్రావణ్ రైతులకు సూచించారు. ఈ మేరకు మండలంలోని పి.చాకరాపల్లిలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విత్తనాన్ని మొలకెత్తించి వాటిని వినియోగించాలని రైతులకు చెప్పారు. విత్తనశుద్ధి పాటించాలని హితవు పలికారు. మంచి విత్తనాన్ని వినియోగించడం వల్ల దిగుబడి బాగుంటుందన్నారు. విత్తనం ఏవిధంగా శుద్ధి చేసుకోవాలో రైతులకు వివరించి చూపించారు. మందులు స్ప్రే చేయడం వల్ల పంటకు, రైతులకు ఎటువంటి నష్టాలు వాటిల్లుతున్నాయో వివరించారు. అదేవిధంగా పొలం గట్లపై కంది విత్తనాలు వేసుకోవడం వల్ల పంట పండి రెండవ పంట వచ్చే అవకాశాలున్నాయని చెప్పి రైతులకు కంది విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మోహనరావు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీడీఏ విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన కె.శ్రీనివాసరావు

పార్వతీపురం టౌన్: ఐటీడీఏ విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఐటీడీఏ పరిధిలో విద్యా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

ఎంపీడీఓ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్‌గా చిన్నారావు



మండల ప్రజాప్రతినిధులను కలిసిన సీనియర్ సహాయకుడు కె.చిన్నారావు

సీతానగరం: మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ సహాయకుడిగా కె చిన్నారావు శనివారం విధుల్లో చేరారు. ఈ మేరకు జెడ్పీటీసీ సభ్యుడు ఎం. బాబ్జీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు బి.శ్రీరాములను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఇక్కడ సీనియర్ సహాయకుడిగా సేవలందించిన నానిబాబుకు ఐటీడీఏ కార్యాలయం ఏఓగా పదోన్నతిపై బదిలీ కావడంతో భోగాపురం ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ సహాయకుడిగా పనిచేస్తున్న నానిబాబు ఇక్కడికి బదిలీపై వచ్చారు. అంతకు ముందు పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు, ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్‌లను ఆయన కలిశారు.

తాలాడలో పొలంబడి

భామిని: మండలంలోని తాలాడలో ఎంఏఓ కొర్ను సింహాచలం సారథ్యంలో వైఎస్సార్ పొలంబడి శనివారం నిర్వహించారు. ఖరీఫ్ వరి పంటలపై పలు సూచనలు చేశారు. సర్పంచ్ వలరౌతు ప్రభావతి, వ్యవసాయ సలహా సంఘ అధ్యక్షురాలు వలరౌతు రవణమ్మ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి విత్తన శుద్ధి, మొలకశాతం గుర్తింపు విధానంపై వివరించారు. ఘనసర ఏఏ గొర్లె ఎలీసా, ప్రకృతి వ్యవసాయ టీఏ గోవిందరావు, రైతులు పాల్గొన్నారు.



విత్తన శుద్ధి పద్ధతి తెలియజేస్తున్న ఏఏ ఎలీసా

అభివృద్ధికి అధిక ప్రాధాన్యం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. పార్వతీపురం పురపాలక సంఘం 29వ వార్డు పరిధిలో ఉన్న రామాపురం కాలనీలో శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధిలో భాగంగా సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకురాలు శోభా హైమావతి, మున్సిపల్ వైస్‌చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, స్థానిక కౌన్సిలర్‌లు యడ్ల త్రినాథ, అర్ చిన్నంనాయుడు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనకు జనం జేజేలు

● ఎమ్మెల్యే కళావతి



రేగులపాడులో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు జనం జేజేలు కొడుతుండడం సంక్షేమ పాలనకు నిదర్శనమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని రేగులపాడు గ్రామంలో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కళావతి పాల్గొన్నారు. గత నాలుగేళ్లలో వైఎస్సార్ పింఛన్ కానుక, వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ పథకం, బడికి పిల్లల్ని పంపించే ప్రతీ తల్లి ఖాతాలో రూ.15 వేలు పడుతున్న అమ్మ ఒడి పథకం తదితర అనేక ప్రభుత్వ సంక్షేమ పథకాలు ద్వారా ఎంత లబ్ధి పొందారో గ్రామస్తులకు వివరించారు. ఏవైనా సమస్యలు ఉన్నాయా అని ప్రతీ ఒక్కరినీ అడిగి తెలుసుకున్నారు. ఒక పక్క ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి.. సంక్షేమ కార్యక్రమాలు వివరిస్తూ... మరో పక్క ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కార మార్గాలకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెట్పీటీసీ జంపు కన్నతల్లి, సర్పంచ్ మెరుగుల భవానీ, చంద్రమౌళీశ్వరరావు, దమలపాటి ఉమామహేశ్వరరావు, ఆదినారాయణ, ధనుంజయ, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా జగనన్న పాలన



కోదండరామ కల్యాణ మంటపంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర

● డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

పాచిపెంట: అర్హతే ప్రామాణికంగా ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్న దొర అన్నారు. ఈ మేరకు శనివారం సాలూరు పట్టణంలోని కోదండ రామ కల్యాణ మంటపంలో, సాలూరు మండలం శివరాంపురం, కూర్మరాజుపేట, పాచిపెంట మండలంలో విశ్వనాథపురం, గురువు నాయుడుపేటలలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి కూడా ఇటువంటి కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. అర్హత ఉన్న లబ్ధిదారులకు ఇంత పెద్ద మొత్తంలో సర్టిఫికెట్లు ఒక్కరోజే అందించడం గతంలో ఎప్పుడూ జరగలేదన్నారు. ప్రజలకు మరింత దగ్గరగా సేవలందించాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ కార్యక్రమం పట్ల ప్రజలకు మరింత అవగాహన కల్పించి అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేకూర్చేలా అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రజాప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. అనంతరం అర్హులైన లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు దండి శ్రీనివాసరావు, పాచిపెంట వీరనాయుడు, జేసీఎస్ కన్వీనర్లు తట్టికాయల గౌరీశ్వరరావు, గిరి రఘు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు, కౌన్సిలర్‌లు వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, ఎంపీటీసీలు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పెదపెంకిలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు

బలిజిపేట: బలిజిపేట పీహెచ్‌సీ పరిధిలో ఉన్న పెదపెంకి గ్రామంలో వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి శనివారం ఫ్యామిలీ డాక్టర్ సేవలను అందించారు. ఈ సందర్భంగా గ్రామంలో 60మందికి, కేంద్రం వద్దకు రాలేనివారికి ఇంటికి వెళ్లి వైద్య సేవలందజేశారు. ఆరోగ్యరీత్యా ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతంలో నివసించే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఇంటివద్దకే వైద్యులు వచ్చి సేవలు అందిస్తారని వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి ఈ సందర్భంగా చెప్పారు. కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాల వద్దకు వెళ్లి చిన్నారులను పరిశీలించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కదలలేని రోగులకు ఇంటి వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. రక్తలేమితో బాధపడుతున్న ఇద్దరిని గుర్తించి విలేజ్ హెల్త్ క్లినిక్‌లో ఐరన్ సుక్రోజ్ ఇచ్చారు. ఎనీమియాతో బాధపడుతున్నవారిని చూసి పోషకాహారం అధికంగా ఉన్న ఆహారం, పాలు, గుడ్లు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ ఎస్‌వీ రమణ, ఎంఎల్‌హెచ్‌పీ సత్య, తదితరులు పాల్గొన్నారు.



గ్రామంలో వైద్యసేవలు అందిస్తున్న వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి

టీకా నిర్వహణలో దృష్టి సారించాలి



టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఐఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు

పార్వతీపురంటౌన్: టీకా కార్యక్రమం నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బంది దృష్టి సారించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు సూచించారు. ఈ మేరకు ఆయన 19వ వార్డు వైకేఎం కాలనీ, 20, 21 వార్డు చర్చి వీధి అంగన్వాడీ కేంద్రాల్లో వైద్య సిబ్బంది నిర్వహించిన వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముందుగా నోటి ద్వారా వేయాల్సిన టీకాల తర్వాత మాత్రమే ఇంజక్షన్ల ద్వారా వేయాల్సిన టీకాలు వేయాలన్నారు. టీకా వేస్తున్న సమయంలో అనుకూలంగా ఉండే విధంగా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని, సరళమైన పద్ధతులు అవలంబించాలని సూచించారు. గడువు తేదీలు పక్కాగా నమోదు చేసి చిన్నారుల తల్లులకు తెలియజేయాలని చెప్పారు. ఈ సందర్భంగా పిల్లల ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారి తల్లులకు, వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ ద్రావణాన్ని డీఐఓ జగన్‌మోహన్‌రావు వేసి, తర్వాత సిబ్బంది వేయడాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది సావిత్రి, ఉమామహేశ్వరి,అంగన్వాడీ సిబ్బంది జానకి, సుబ్బలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వాసవీక్లబ్ ఆధ్వర్యంలో పేదలకు సహాయం



మాట్లాడుతున్న ఇంటర్నేషనల్ వాసవీక్లబ్ ఉపాధ్యక్షుడు కంకటాల ప్రభాకరరావు

సీతానగరం: ఇంటర్నేషనల్ వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది జూలై1 న సభ్యుల సహకారంతో పేదలకు ఆర్థిక సహాయం అందిస్తామని వాసవీక్లబ్ ఉపాధ్యక్షుడు కె.ప్రభాకరరావు అన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక వాసవీక్లబ్ జోన్ చైర్మన్ ఆరిశెట్టి వెంకటసత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు ప్రభాకరరావు, రీజనల్ చైర్మన్ ఎం.విశ్వేశ్వరరావుల ఆధ్వర్యంలో ఇద్దరు మాజీ సైనిక ఉద్యోగులను సత్కరించారు. అలాగే 10 మంది పేదలకు చీరలు దుప్పట్లు పంపిణీ చేసి ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాపార వేత్త ఆరిశెట్టి గోవిందరావు పాల్గొన్నారు.

రోగులకు మరింత మెరుగైన సేవలు

వీరఘట్టం:

రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన విలేజ్ హెల్త్ క్లినిక్స్ నేడు ప్రజా వైద్యశాలలుగా మారాయని, రోగగ్రస్తులను అక్కున చేర్చుకుంటున్నాయని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. జాతీయ సికిల్‌సెల్ ఎనీమియా నివారణలో భాగంగా శనివారం వండవ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో సికిల్‌సెల్ ఎనీమియా పరీక్షలను ఎమ్మెల్యే కళావతి ప్రారంభించారు. రక్తహీనత ఉన్నవారు వెంటనే ఇక్కడ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. సికిల్‌సెల్ ఎనీమియా నిర్ధారణ అయితే అటువంటి వారికి ప్రభుత్వం ప్రతీ నెలా రూ.10 వేలు పింఛను అందజేస్తుందని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మిడితాన కళ్యాణి, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



సికిల్‌సెల్ ఎనీమియా పరీక్షలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కళావతి

క్లుప్తంగా

5న మోడల్‌స్కూల్ పరీక్ష

మక్కువ: మండలంలోని ములక్కాయవలస మోడల్‌స్కూల్‌లో 7,8,9వతరగతుల్లో విద్యార్థులు చేరేందుకు మిగులు సీట్లకు ఈనెల 5వతేదీన ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.స్వర్ణలత శనివారం తెలిపారు. 5వతేదీన ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు ఆమె స్పష్టం చేశారు. విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డుతో పరీక్షకు హాజరుకావాలని సూచించారు. ఇంకా ఏవైనా సందేహాలుంటే ఫోన్ 7032996553 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు ఉచితంగా పుస్తకాల పంపిణీ



పంపిణీ చేసిన పుస్తకాలతో విద్యార్థులు

బలిజిపేట: మండలంలోని గంగాడలో గల రెండు పాఠశాలల్లో చదువుతున్న 120మంది విద్యార్థులకు డి.సత్యనారాయణ వెల్ఫేర్ అసోసియేషన్ ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేసింది. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న ఒకొక్కరికి పుస్తకం, పెన్ను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, సూర్యనారాయణ, బి.నారాయణరావు, జి.వెంకటినాయుడు, ఎస్.జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో ప్రతిభావంతులకు నగదు బహుమతులు



విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తున్న అయ్యగారి ఆనంద్

సీతానగరం: ఇటీవల జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన స్థానిక ఉన్నత పాఠశాలలో చదివిన నలుగురు విద్యార్థులకు విశాఖపట్నానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ అయ్యగారి ఆనంద్ తండ్రి నరసింహం (ప్రముఖన్యాయవాది) జయంతిని పురస్కరించుకుని నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా చొక్కాపు భవాని రూ 2 వేలు, ఎం పద్మిని, కె రాజేశ్వరి, మడే మోహన్‌లు రూ1000 వంతున నగదు బహుమతులు శనివారం పాఠశాలలో అందుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవల్లో ముందంజలో ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న 104 నోడల్ అధికారి డాక్టర్ వినోద్

పార్వతీపురంటౌన్: ప్రజలకు సేవలు అందించడంలో ముందజలో ఉండాలని 104 నోడల్ అధికారి డాక్టర్ వినోద్ అన్నారు. 108,104,102 సేవలు ప్రారంభించి నేటికి 3 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులంతా మూడవ వార్షికోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో గల సిబ్బంది అంకిత భావంతో పని చేయడం వల్ల ప్రజలకు సేవలు అందించడంలో పార్వతీపురం మన్యం జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో 108 జిల్లా మేనేజర్ మన్మథ నాయుడు, 104 జిల్లా మేనేజర్ దుర్గాప్రసాద్, జిల్లా ఫ్లీట్ మేనేజర్ భాస్కరరావు, 108,104 ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్‌లు విజయ్‌కుమార్, గిరిబాబు, రాజశేఖర్, ప్రశాంత్, అత్యవసర వాహనాల్లో పనిచేస్తున్న సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీ ఫీవర్‌పై అవగాహన తప్పనిసరి



ర్యాలీలో పాల్గొన్న వైద్యసిబ్బంది

పార్వతీపురంటౌన్: డెంగీ వ్యాధిపై అవగాహన తప్పనిసరి అని సీహెచ్ఓ కల్యాణి అన్నారు. ఈ మేరకు పార్వతీపురం మండలం నర్సిపురం హెల్త్ సెంటర్ సిబ్బంది డెంగీ ఫీవర్ శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా హెల్త్‌సెంటర్ నుంచి సచివాలయం వరకు ర్యాలీ చేపట్టి, గ్రామాలో ప్రజలకు డెంగీ ఫీవర్ రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సుగుణకుమారి, ఏఎన్ఎం ఆదిలక్ష్మి, ఆశకార్యకర్తలు, కమ్యూనిటీ హెల్త్‌వర్కర్లు పాల్గొన్నారు.